# ఏ లవ్ స్టోరీ

అన్నవరం కొండ దగ్గర బస్ స్టాప్‌లో మా బస్సు ఆగింది. కొండ మీద సత్యనారాయణ స్వామి ఆలయంలోంచి సన్నగా సుప్రభాతం వినిపిస్తూంది. నేనూ, నా భార్య క్షీరాబ్ధికన్యకా బస్సు దిగాం. నా బాల్య మిత్రుడు రామ్మూర్తి ఎదురొచ్చి విష్ చేశాడు.

"ఎన్నాళ్ళ కెన్నాళ్ళకి !" అని నన్ను కౌగిలించుకున్నాడు.

అతను కొండమీద సూపర్నెంటుగా పనిచేస్తున్నాడు. అతను మమ్మల్నిప్పుడు పక్కనే ఉన్న అనంతలక్ష్మి కాటేజికి తీసుకెళ్ళాడు. మా కోసం తను రిజర్వు చేసుంచిన రూంలో మమ్మల్ని ప్రవేశ పెట్టాడు. " నాకు డ్యూటీ ఉంది. కొండ మీద ఎంక్వయిరీలో ఉంటాను. మీరొచ్చేయండి- మెట్లెక్కొచ్చినా సరే, బస్సయినా సరే" అన్నాడు. వెళ్ళి పోయాడు.

మే మిద్దరం స్నానాలు చేశాం. బయట హొటల్లో కాఫీ తాగాం. పత్రీ పళ్ళూ కొనుక్కుని మెట్ల దారిన బయల్దేరాం. సింహద్వారం దాటాక క్షీర, " ఆగండాగండి. ఇక్కడ క్షేత్రపాలిక కనకదుర్గ ఉంది. ముందావిడను చూడాలి" అంది.

నిజమే, కుడి వైపున అరుగు మీద అమ్మవారి ఆలయం చిన్నది ఉంది. మేం లోపలి కెళ్ళాం. క్షీర నా చెవిలో గొణిగింది, "ఇక్కడ అర్చకు డేమంటాడో వినండి " అని.

అర్చకు డిచ్చిన హారతి కళ్ళ కద్దుకున్నాం. పాదుకలిస్తూ ఆయన, " పునరాగమన ప్రాప్తిరస్తు" అన్నాడు. " అదే ! ఇక్కడల్లాగే అంటారు" అంది క్షీర.

మళ్ళీ మెట్లెక్కటం మొదలు పెట్టాం. క్షీర నన్నానుకొని నడుస్తోంది. నే నామెను అతుక్కుని ఎక్కుతున్నాను. క్షీర ! ముదర కాగిన పాల లాంటి గోధుమ కలిసిన తెలుపు ! అంత మాత్రాన ఆమె అందగత్తె అని చెప్పి ఆత్మవంచన చేసుకోను. ఆమె కనుముక్కు తీరైన మనిషి. అంగాంగ సౌష్టవం కల పడుచు అని మాత్రం చెప్పగలను. నా ఆదాయాలు, ఆనందాల్నే కాక, నా చికాకులు, సమస్యల్నీ కూడా పంచుకోటానికి సంసిద్ధమవుతూంటుందామె. ఇవి చాలు నాకు, ఆమెతో సంసార సౌఖ్యాన్ని పంచుకోటానికి.

మా పెళ్ళయి ఆర్నెల్లయింది. పెళ్ళయిం తర్వాత మా మొదటి పరిచయంలోనే ఎందుకొచ్చిందో వచ్చింది మాకు ఆ ఆలోచన- అన్నవరం స్వామిని దర్శించుకొందామని. నిజానికి తనే ఆ మాట అంది. నేను 'సరే' అన్నాను. అదిప్పటికి కుదిరింది. ఎందుకంటే మా రాజమండ్రి కాలేజికి సంక్రాంతి సెలవ లిప్పటికొచ్చాయి గనక. అసలింకా వేసవి కాలం సెలవలదాకా ఆగాలనిపించింది. కానీ క్షీర మాటని గౌరవించాలి అన్న ఆలోచన నన్ను ఆగనివ్వలేదు. నాకు ప్రేమంటే ఏమిటో తెలీదు. నేను ఎవర్నీ ప్రేమించలేదు. నాకు తెలిసిందల్లా గౌరవించటమే.

మెట్ల కిరువైపులా మారేడు చెట్లు పెరిగున్నాయి పూజ కోసం మారేడు దళాలు కోసినప్పుడు కిందికి జారి పడిన దళాలు మెట్లెక్కే వాళ్ళ కాళ్ళ కిందపడి నలిగి చక్కని సువాసన వెదజల్లుతున్నాయి " వేసం కాలంలో అయితే మారేడు పళ్ళు రాలి పడుతుంటాయి అవి ఇంకా సువాసన " అంది క్షీర. చాలా క్షేత్రాల్లో లాగా ఇక్కడ మెట్ల మీద బిచ్చగాళ్ళు లేరు అదొక పెద్ద రిలీఫ్ అక్కడక్కడ చెత్త

కుండీలున్నాయి 'చెత్తను ఈ కుండీల్లో పడెయ్యండి మన ఆలయాన్ని మనం పవిత్రంగా ఉంచుకుందాం' - అని రాసున్న బోర్డులు వాటి పక్కనే ఉన్నాయి. మూత్ర శాలలూ, పక్కనే పంపులూ తగిలాయి. మెట్ల మీద శుభ్రత గురించి కాబోలు కాకీ దుస్తుల్లో కాపలా వాళ్ళిద్దరు మాకు తారసపడ్డారు.

ఇంకా పాతిక ముప్పై మెట్లు మాత్రమే ఉన్నాయనగా క్షీర అంది - " ఇదిగో ఎడం వైపు కెళ్ళి గుట్టెక్కితే మంచి బండొకటుందండి. దాని మీద కాసేపు కూర్చుందామండి. ఊరు చూడొచ్చు."

మే మిద్దరం అటు వైపు వెళ్ళాం. అక్కడ కొండంతా చాలా వాలుగా ఉంది. పదడుగులు దూరంలో ఒక చదును బండ కూడా ఉంది. దాని మీద కెళ్ళి కూర్చున్నాం. మా చుట్టూ ముళ్ళ గోరింట పొద లున్నాయి. వాటి పూలు శివుడికిష్టం. మా వెనకాలే తెల్ల గన్నేరు చెట్టుంది. పూలు ఒకటీ అరా రాల్తున్నాయి. నేను నాలుగు పూలు ఏరి క్షీర తల్లో తురిమాను. ఆమెకు దూరంగా జరిగి ఆమెను చూస్తూ కూర్చున్నాను.

అది డిసెంబర్ నెల. ఉదయం ఏడు గంటల వేళ, చలి ఇంకా విరగ లేదు. మమ్మల్ని చూసి ఉషాకన్య ఈర్ష్య పడింది కాబోలు, తన భర్తను పైకి రానివ్వకుండా తనతో బాటే మబ్బుల్లో దాచేసుకుంది! గడ్డి పరకల్లోని మంచు బిందువులు తగిలి క్షీర కాలి గోళ్ళకున్న నెయిల్ పాలిష్ ఎర్రగా మెరుస్తోంది. ఆకుపచ్చ చీర, ఎర్రటి కుంకం బొట్టు, నల్లటి సిగలో తెల్లగన్నేరు, అసలు తెలుపు రంగు - వాటిలో క్షీర మెరిసి పోతోంది. సాక్షాత్తు ఆ రత్నగిరి వన కన్యే దిగి వచ్చి గుత్తంగా చిన్న పాదలాగా నా ముందు కూర్చున్నదా అనిపించింది. నాలో అది అభిమానమా, ఆరాధనా, ప్రేమా? ఏమో ఏమిటో!

" ఏమిటి అలా చూస్తున్నారు?" అంది. మళ్ళీ వెంటనే " అదిగో ఆ దూరంగా కనిపిస్తున్నదే అన్నవరం స్టేషను. మూడు కిలో మీటర్లిక్కడికి. ప్రతి రైలుకీ కొండ మీదకి బస్సు కనెక్షనుంది. కోరమండల్, కొచ్చిన్ బళ్ళూ తప్ప అన్నీ ఆగుతాయి అక్కడ. మనం మెట్లకి ఎడం పక్క కెళ్ళి చూస్తే దూరంగా, ఎత్తుగా కనిపిస్తుంది వంతెన. అది పంపా రిజర్వాయరు తాలూకు లాకు. అక్కడే పెద్ద పూల తోటుంది దేవస్థానం వారిది. చాలా బాగుంటుంది. ఇక్కడ ఇదిగో ఈ కుడి పక్క కొండ అంచున కనిపిస్తున్నదే బిల్డింగు. అది దేవస్థానం కాలేజి. ప్రిన్సిపాల్ అప్పారావు గారు చాలా సహృదయులు. మంచి దైవభక్తి కలవారు. స్టాఫ్ అంతా ఆయనకి సహకరిస్తారు"?

" ఇవన్నీ నీ కెల్లా తెలుసు ఎప్పుడైనా వచ్చావా?" అన్నాన్నేను.

"ఊఁ వచ్చాను" అంది ఎటో చూస్తూ. మళ్ళీ వెనక్కొచ్చాం. మెట్లెక్కసాగాం. అక్కడక్కడ సుప్రభాతం శ్లోకాలు రాసున్న బోర్డులున్నాయి. మళ్ళీ క్షీర చెప్పగా కుడి పక్కనున్న ఇంకో క్షేత్ర పాలిక వన దేవత ఆలయానికెళ్ళొచ్చాం.

కాంటీనొచ్చింది. అందులోకెళ్ళాం. ముందుగా టిక్కెట్టు తీసుకునుంటే పదకొండూ, పన్నెండు గంటల మధ్య భోజనం పెడతారట అక్కడ. బాగుంటుందట. మేం కాఫీ తాగాం. వెనక్కొస్తుంటే మాలాంటి యువజంట ఒకటి ఎదురు పడింది. ఆ భర్త పచ్చగళ్ళ చొక్కా వేసుకున్నాడు. ఆ భార్య మెడ నిండా నగలున్నాయి. ఆ నగలు ఆమె నలుపును కప్పేస్తున్నాయి. వాళ్ళని చూసి క్షీర హఠాత్తుగా ఆగిపోయింది. నేను "పద పద" అన్నాను కదిలాం.

పైన విశాలమైన నాపరాళ్ళు పరిచిన ఆరుబయట స్థలం. అందులో ఒకపక్కగా క్షేత్రపాలకుడు

రాములవారి ఆలయం. అక్కడ దర్శనమయి ఇవతలకి రాగానే రామ్మూర్తి వచ్చి కలిశాడు " రండి - ముందు స్వామిని దర్శనం చేసుకొద్దురు గాని" అన్నాడు.

కుడివైపుగా తిరిగి నడుచుకుంటూ వెళ్ళాం మళ్ళీ మెట్లెక్కాం. అక్కడ గోపురం వెనకాల ప్రాకారంలో పెద్ద ఆలయం ముందర ముఖమంటపం. దాని పక్కనించి తిరిగి ప్రదక్షిణం చేస్తూ వెళ్ళాం. ఆ పక్కనే ముప్పై రూపాయల టిక్కెట్ల వాళ్ళు వ్రతాలు చేయించుకుంటున్నారు. వరుసల్లో కూర్చుని మేం ఆలయం చుట్టూ ప్రదక్షిణం చేసి ఆలయంలో ప్రవేశించాం.

రామ్మూర్తి అన్నాడు-" ఇక్కడ స్వామి హరిహర హిరణ్యగర్భుల ఆకారం - అంటే కింద శివుడు పైన విష్ణువు. కనుక అదిగో ఆ గదిలో కనిపించేదే లింగం యొక్క మొదలు. అక్కడ స్వామి తాలూకు యంత్రం ఉంది. వెలిసిన స్వామి పైన కనిపిస్తాడు మనకి. ఇందాక రామాలయంలో చూశారా- మారేడు దళాలు అర్చన చేశారు. దానిక్కారణం ఇది శివాలయం కూడా కావటమే."

మళ్ళీ మెట్లెక్కాం పైన అసలు స్వామి గుడి ఉంది. ప్రధాన అర్చకులు దేవులపల్లి నారాయణగారు మమ్మల్ని సాదరంగా లోపలికి తీసికెళ్ళారు. గర్భాలయంలో కూర్చోబెట్టి మా గోత్రనామాల్తో పూజ చేశారు. హారతి ఇచ్చారు. కళ్ళకద్దుకున్నాం.

స్వామి పేరు సత్యదేవుడు. పక్కనే అమ్మవారు అనంతలక్ష్మి. ఆ మూర్తుల ముందర కిందుగా శివలింగం. అన్ని మూర్తులకు వెండి తొడుగులు, మకర తోరణాలు, మంటపమూ- అంతా వెండే. స్వామికున్న కిరీటం తాలూకు శిఖరం స్వామికి ఎడమవైపున వంగుంది అది అప్పటి రాజుల ఆచారంట. స్వామి బొడ్డులో కెంపు. అమ్మవారికి మామిడి పిందెల హారమూ, వలకసర్లూ, ఇంకో రెండు మూడు గొలుసులూ కాక రవ్వలూ కెంపులూ పొదిగిన కర్ణాభరణాలూనూ. ఓహ్, అంతా వెండీ బంగారు మయమే!

క్షీర అంది- " ఆ రవ్వల వడ్డాణం బాగుంది. కదూ!.... అట్లాంటిది నా కోటుంటే బాగుండును.... ఎంతుంటుందదంటారు?"

నేనన్నాను- " అడుగు పొడుగుండొచ్చు. నీ పిడికిలంత నడుముకు అది సరిపోక పోవచ్చు."

క్షీర నన్ను మోచేత్తో పొడిచి అంది- "పొండి, ఎప్పుడూ వేళాకోళమే. నేనడిగింది ఖరీదు."

"క్షీర ! అట్లాంటిది గాని మనం ఇంట్లో పెట్టుకుంటే ఇంక మనం ఒకళ్ళ నొకళ్ళు మర్చిపోయి నిద్రాహారాలు మానేసి మనస్సులో ఎప్పుడూ దాన్ని గురించే ఆలోచిస్తుంటాం - ఎట్లా దాచుకోన్రా దేవుడా దీన్ని ! - అని. స్వామి కాబట్టి ఇంత సంపద భరిస్తున్నాడు. మన మెక్కడ భరించగలం!"... " ఇప్పుడున్నామా ఒకళ్ళ కొకళ్ళం మనస్సుల్లో?" క్షీర మొహంలో లీలగా కంగారు తొంగి చూసింది.

" నువ్వున్నావు నా మనస్సులో. నీ సంగతి నువ్వు చెప్పాలి మరి!"

" నాకు అంతే. నా అంతటా మీరే ఉన్నారు."

నా ఉత్సాహాన్ని గమనించి నారాయణ గారు అక్కడున్న కుంకుమతో నిండిపోయున్న మేరు మధ్య శ్రీచక్రాన్ని చూపించారు. దక్షిణావర్త శంఖాన్ని కూడా చూపించారు. దానికి వెండి తొడుగు వేసుంది. అది వెండి పీఠం మీదుంది. దాంతోనే ఆయన మాకు తీర్థం ఇచ్చారు " ఈయన వందేళ్ళనాడు ఇక్కడ ప్రతిష్ఠించబడిన స్వామి. బెండపూడి వెళ్ళవలసిన యంత్రం పొరపాటున ఇక్కడికి రావటంతో ఈయనిక్కడ

బిగిసి పోయాడు. స్వామి వైష్ణవుడే అయినా అర్చకులం మాత్రం స్మార్తులం. అదీ ఇక్కడ విశేషం. ఈ యంత్ర బలం ఎంత గొప్పదంటే- ఆ యేటి కాయేడు రెట్టింపుగా ఈ తీర్థం ప్రభ పెరుగుతోంది గాని తరగటమన్నమాట లేదు. ఈయన్ని నమ్ముకొని వచ్చినవాడెవరూ వట్టిచేతుల్తో తిరిగిపోలేదు. తిరిగి రాకుండానూ ఉండడు... పునర్దర్శన ప్రాప్తిరస్తు - శీఘ్రమేవ సుపుత్ర ప్రాప్తి రస్తు'' అంటూ పాదుకలిచ్చి దీవించారు.

నేను కింద నా కాలితో క్షీర కాలు నొక్కాను. తను మళ్ళీ నా కాలు నొక్కింది - చచ్చేట్టు! 'స్త్రీణాం... కామః అష్టగుణోభవేత్' కారణమా! ఏమో మరి? రామ్మూర్తి పిలిచాడు పక్కనున్న పార్వతీ అమ్మవారిని దర్శించమంటూ. మేం వెనక్కు తిరిగాం. పచ్చగళ్ళ చొక్కా దంపతులు చటుక్కున ఎదురయ్యారు. లోపలకొస్తూ వాళ్ళు మమ్మల్ని తేరిపారా చూశారు. అసలు క్షణం ఆగారేమో కూడా ! క్షీర చటుక్కున నా వెనక్కు తప్పుకుంది చురుగ్గా. అట్నుంచి అటే పక్కకి దారి తీసింది.

పార్వతీ అమ్మవారిని దర్శించుకున్నాం. మళ్ళీ మెట్లు దిగి కిందకి, ఇందాకటి ప్రవేశస్థలానికి వెళ్ళాం. రామ్మూర్తి లింగపాదం ఉన్న ఇందాకటి గది దగ్గరికి దారి తీశాడు.

క్షీరతో నేను '' అంత కంగారు పడ్డావు గదా'' .. అని ఏదో అనబోయాను.

మధ్యలో చురుగ్గా అంది క్షీర - '' మరి . మరి... స్వామికి మీసాలున్నాయేంటండీ వెండివి?'' నేను కోశాను లైట్‌గా కోత-'' అవునవును అదా.. అదేంటంటే... అనేక అవతారాలెత్తి భూదేవినీ రాక్షసుల్తో పోటీపడి శ్రీదేవినీ గెల్చుకుని అది చాలక ఇంకా -' రండ్రా, నా దేవి మీద ఎవడేస్తాడో కన్ను చూస్తాను' అంటున్న వీరావేశం అన్నమాట! - నాలాగా అన్నమాట !'' నేను పకపకా నవ్వాను.

క్షీర చటుక్కున నా మొహంలోకి మొహం పెట్టి తీక్షణంగా అంది? '' నిజంగానా... మీరూ అంతేనా ... నన్ను వదులు కోరు గదా!'' ఇట్లా అంటూ నా అరచెయ్యితీసి ముద్దు పెట్టుకుంది. చటుక్కున చెంపకి రాసుకుని వదిలేసింది.

దూరం నుంచి రామ్మూర్తి పిలుస్తున్నాడు. మేము అటు కదిలాం. అక్కడి అర్చకుడన్నాడు- '' పైన చూశారుగా, స్వామి విష్ణువు. ఆయన కింది భాగం ఇదిగో ఇది లింగాకారం. ఇదిగో ఇక్కడ యంత్రం ఉంది. రండి, చుట్టూ ప్రదక్షిణం చెయ్యండి '' మేం కదిలాం. లోపల నాలుగు మూలలా గణపతి, ఆదిత్య, అంబిక, మహేశ్వర విగ్రహాలు చిన్నవి. వెండి తొడుగుల్తో ఉన్నాయి. చాలా బాగున్నాయి. అక్కడ మళ్ళీ హారతి అయ్యాక బయటకొచ్చాం. గోపురం దాటి బయటకు నడిచాం.

ఇందాకటి రామాలయం దగ్గరకెళ్ళి అక్కణ్ణుంచి వెనక్కి కొండ మీది కెళ్ళాం. అక్కడ కాటేజీలున్నాయి. దేవస్థానం వారి పాత కాటేజీలకన్నా కొత్త కాటేజీ గదులు బాగున్నాయి. ఈ రెంటికన్నా బాగున్నాయి తిరుమల తిరుపతి దేవస్థానం వారి గదులు. '' ఫామిలీతో వచ్చిన వాళ్ళకు అన్నింటికన్నా బెస్ట్ ఈ టిటిడి వాళ్ళ రెండు పడగ్గదుల సూట్ అద్దె నలభై . అదిగో తులసి వనం చూశారా. కింద చెత్తకుండీలు. ముష్టాళ్ళను వెళ్ళ గొట్టడం, సుప్రభాతం బోర్డులు, మారేడు చెట్లు ,కొండ చుట్టూ సంపంగి చెట్లూ, ముళ్ళ గోరింట, తుమ్మి పొదలూ, ఈ తులసి వనం. ఇట్లాంటివి ఎన్నో జరుగుతున్నాయి. ఇవన్నీ మా ఈ.వో. కృష్ణమూర్తిగారి చలవ. ఆయనొచ్చిందగ్గర్నించీ దేవస్థానం రోజుకో రకంగా అభివృద్ధి చెందుతోంది. పద్దంటే డబ్బు ! నిత్యాన్నదానానికి డిడిలే డిడిలు! రేపు తొంభై ఆగష్టులో శత జయంత్యుత్సవాలు.

పాలిటెక్నిక్ రాబోతోందీ ఊళ్ళోకి. ఒక్క మాటలో - స్వామి ఈయన్ని ఆవహించారు. అంతే, ఇది మా అదృష్టం !".. "ఇక్కడి నుంచి దానవాయి పేట సముద్రం కనిపిస్తుంది కదూ! బీచ్ చాలా బాగుంటుంది. అన్నట్టు ఇక్కడ సన్‌డయలూ, పెద్ద సోలార్ హీటర్సూ ఉండాలే!" అంది క్షీర.

రామ్మూర్తి ఆ మూడు చూపించాడు. మెట్లు దిగి తిరిగి రామాలయం దగ్గర కొచ్చాం. ప్రసాదం పొట్లా లిప్పించాడు రామ్మూర్తి. ఉచిత భోజనం కూడా పెట్టించాడు. ఆ గళ్ళ చొక్కా దంపతులు ఎదురొచ్చారు. క్షీర వడివడిగా నడిచి బస్సు దగ్గర కెళ్ళిపోయింది. రామ్మూర్తి అతన్తో మాట్లాడాడు. నా దగ్గరికి తీసికొచ్చి నాతో "ఇతడు నాకు ఇంకో ఫ్రెండు విక్రాంత్. విశాఖలో బాంకులో పనిచేస్తున్నాడు. ఉద్యోగమూ భార్యా - ఇద్దరు ఒకే సారిగా వచ్చాయట " అన్నాడు.

మేమిద్దరం విష్ చేసుకున్నాం. క్షీర దూరం నించి అసహనంగా నన్ను కేకేస్తోంది. నేనెళ్ళాను. కోపంగా ఆమె అంది " అడ్డమైన వాళ్ళ దగ్గరా ఆగిపోవటమేనా? నన్నెందుకు తీసుకొచ్చినట్టు?" నేను అయోమయంగా చూశానామె వైపు. బస్సులో కాటేజీ కెళ్ళాం. వెళ్ళంగానే అలసట వల్ల నాకు ఒళ్ళు తెలియని నిద్ర పట్టింది. లేచేటప్పటికి సాయంత్రం ఆరున్నర. "లే, లేచి తయారవు. దర్బారు సేవ చూద్దాం " అన్నాను క్షీరతో.

ఆమె " నేరాలేను.... మీ రెళ్ళి రండి" అంది. ఆమె ఒళ్ళు వెచ్చగా ఉంది. కళ్ళు ఎర్రబడుతున్నాయి!

" ఒంట్లో బాగుండకపోతే ఏదో మందేసుకోవాలిగాని. నిన్నొదలి నన్నొక్కణ్నే వెళ్ళి ఎంజాయ్ చెయ్యమనటం బాగుందా ! లే లే " అన్నాను.

అయిష్టంగానే ఆమె లేచింది. ఇద్దరం బస్సెక్కి కొండమీది కెళ్ళాం. సమయం ఏడు గంటలు. దర్బారు సేవ ముఖ మంటపంలో జరగబోతోంది. లోపలి కెళ్ళాం. స్వామికి ఉత్సవ విగ్రహాలు ఆరుజత లున్నాయట! అందులో రెండు ఈ ముఖమంటపంలోనే ఉన్నాయి. ఒకదానికిప్పుడు దర్బారు సేవ. భక్తులు రెండు వరుసల్లో నుంచోనున్నారు. ఒక వరుసలో స్వామికి దగ్గరగా మేమిద్దరం నుంచునున్నాం.

ఇంతలో రామ్మూర్తి మంటపం బయటనుంచి నన్ను పిలిచాడు. నేను బయటకెళ్లాను. అతను గళ్ళచొక్కా విక్రాంత్ దంపతులతో మాట్లాడుతున్నాడు. అతనేదో విట్టేశాడు. నేనూ, విక్రాంత్ నవ్వాం వాళ్ళిద్దరి సంభాషణా వింటూ రెండునిముషాలు అక్కడ నుంచున్నాన్నేను.

అంతే ! కంగారు కంగారుగా మంటపం అంచుకొచ్చి తీగజల్లెడలోంచి క్షీర కేకేసింది - " ఏమండీ రండి, రండి అయిపోతోంది !" నేను లోపల కెళ్ళాను. నా వెనకాలే రామ్మూర్తి వచ్చి నా పక్కన నుంచున్నాడు. ఆ దంపతులొచ్చి ఎక్కడా చోటు లేక కాబోలు రెండో వరుసలో మా కెదురుగా నుంచున్నారు. క్షీర అబద్ధం చెప్పింది. పూజ ఇంకా మొదలెట్టలేదు.

అయిదు నిముషాల తరువాత స్వామికి పూజ మొదలైంది. ఏకార్తి, ద్వివర్తి, నక్షత్ర హారతులయ్యాయి. మంత్ర పుష్పం అయింది. వెంటనే సావధాన గద్య చెప్పాడు ఒక అర్చకుడు - " శ్రీ మన్మహాదేవ దేవోత్తమ! దేవతా సార్వభౌమ ! శ్రీ పంపానదీతీరవాస ! శ్రీ రత్నగిరి నివాస ! శ్రీ సద్భక్త మానసోల్లాస! శ్రీ మదాద్యామహాలక్ష్మీ సమేత శ్రీ వీరవేంకట సత్యన్నారాయణ ప్రభో, పరాక్ బహు పరాక్!"

ఆ వెంటనే అనేక వేదవిద్యలను విని ఆనందించమని స్వామికి చెప్పే అవధారణ గద్య

చెప్పబడింది - ‘అఖిల లోకాశ్చర్యకర సౌందర్య లీలావిలాస విభ్రమావిర్భావ శ్రీ మద్దివ్య మంగళ విగ్రహా! శ్రీ మద్దివ్య వైకుంఠ సదన సంస్థాన నివాసా :! ఆశ్రిత జన సంరక్షణ నిమిత్త వైభవ రక్షణాఖ్యాత రత ! శ్రీ మహా విభూతే! శ్రీ మదాద్యాది మహాలక్ష్మీ సమేత శ్రీ వీరవేంకట సత్యనపారాయణస్య సాయంకాల పూజాంగత్వేన చతుర్వేద పారాయణాదౌ ఋగ్వేద మవధారయ’’ .. (అవధారయ అంటే వినవయ్యాస్వామీ- అని అర్థం )

అప్పుడు ముందరగా కూర్చున్న నలుగురు ఆస్థాన వేద పండితుల్లో ఋగ్వేద పండితులు ఋగ్వేదం పనస ఒకటి చదివారు. అది నాకు బాగుంది. క్షీర క్కూడా బాగుందేమో అడుగుదామని పక్కకి చూశాను.

ఆమె నా ఎడం భుజం కిందికి జరిగింది. తలొంచుకునుంది.

ఆ వేదం తరువాత శుక్ల యజుర్వేదం పారాయణం చేశారు. ఇద్దరు పండితులు. ముందు ఆయన కృష్ణ యజుర్వేదం పారాయణం అందుకున్నారు. ఆయన గొంతు ఒక్కసారిగా ఖంగుమని లేచింది. మంటపం దద్దరిల్లింది.

‘‘... ఔదుంబరో ఔదుంబరో యూపో భవతి- ఉర్గ్వైవ ఊర్గ్ -ఉదుంబర ఊర్గ్ పశవః పశవః ఊర్గ్ ఊర్జా పశవః- ఊర్జై వాస్మా ఏవాస్మా ఊర్జం- ఏవాస్మా ఊర్జం- పశూన్ ఊర్జం- పశూన్- ఏవాస్మా పశూన్ పశూన్ ఏవాస్మా -పశూనవా రింద్ రింధ్ పశూనవా..’’

నా చెవుల్లో తుప్పు వదిలి పోయింది. అమృతం కురిసినట్లయింది. జలపాత మంత వేగంగా ప్రతి అక్షరన్ని స్పష్టంగా పలుకుతూ కంచుకంఠంతో ఆ పనస చదవగలగటానికి ఆ పండితులు- సూర్యనారాయణ అవధానిగారట- ఎంత పుణ్యం చేసుకున్నాడో! ఎన్ని జన్మల నుంచి చేసుకొస్తున్నాడో! జన్మలు- అవును గడిచిన జన్మ పరంపరల్లో చేసిన కర్మల ఫలితమే చాలావరకు ఈ జన్మలో మనం నడిచే తీరును నిర్ణయిస్తుంది. ఇప్పుడు చేసుకునేది పై జన్మను శాసిస్తుంది. వివాహం విషయంలో కూడా అంతే. ఒక జంట వివాహబంధంలో కలవటం అనేది ఇప్పటి కర్మఫలం కాదు. అన్నట్లు, క్షీరాబ్ధి కన్యకకు నేనూ, నాకు క్షీర దక్కటం కూడా...

చటుక్కున క్షీర వైపు చూశాను. ఆమె పూర్తిగా నా వెనక్కి జరిగెళ్ళిపోయి కూర్చుంది. ఆమె నుదురు వెచ్చగా నా వీపు కాస్తోంది. ఆమె తలెత్తి నన్ను చూసి చటుక్కున తలదించేసుకుంది. ఆమె కళ్ళల్లో నీళ్ళు సుళ్ళు తిరుగుతున్నాయి.

ఉపనిషత్తుల పఠనం మొదలైంది. తైత్తిరీయంలో శిక్షా వల్లిలోని శాంతి పాఠం చదువుతున్నారు. ‘‘ శం నో మిత్రస్యం వరుణః - శం నోభవత్వర్యమా- శం న ఇంద్రో బృహస్పతి : - శంనో విష్ణు దురుక్రమః - నమస్తే వాయో- త్వమేవ ప్రత్యక్షం బ్రహ్మాసీ ... ఓం శాంతి శ్శాంతి శ్శాంతిః’’

ఆ తరువాత లలితా గీతి !

‘ మంగళం మాసత్వసామినే మంగళం
మంగళం మల్లికామాలినే మంగళం
మంగళం సన్మన స్థాయినే మంగళం
మంగళం సత్యదేవాయతే మంగళం’

" దర్బారు సేవ అయిపోయింది. ఏకాంత సేవ- అదే పవళింపు సేవ కూడా చూద్దురు గాని రండి" అన్నాడు రామ్మూర్తి. తొమ్మిదిపోయింది. చాలామంది భక్తులు ఇంటి ముఖం పట్టారు. స్వామివారి గర్భగుడికి ఎదురుగా పక్కగా డాబా మీదుంది అద్దాల మంటపం. లోపల ఉత్సవవిగ్రహాలను వెండి ఉయ్యాల్లో ఉంచి స్వామికి పునః పూజ చేస్తున్నారు. మేమిద్దరం పక్క పక్కన కూర్చున్నాం. నెమ్మదిగా వచ్చి విక్రాంత్ దంపతులు మళ్ళీ మాకెదురుగా కూర్చున్నారు. లోపల పూజయింది. హారతిచ్చాడు అర్చకుడు. "ముందరగా దంపతులైనవారు చేతులుపట్టుకుని లోపలికి రండి. స్వామిని తిన్నగా చూడకండి. అమ్మవారితో ఆయన పవళించారు. స్వామికి ఎదురుగా ఉన్న అద్దంలో చూసి నమస్కరించండి. ఒక ప్రదక్షిణం చేసి వచ్చేయండి" అన్నాడు.

అక్కడంతా ఏడెనిమిది మందిమి మాత్రమే ఉన్నాం. అందులోనూ దంపతులం మా రెండుజంటలే.

నేను క్షీర చెయ్యి పట్టుకుని లేవబోయాను. ఆమె చెయ్యికాలిపోతోంది! బుగ్గ చూసాను. పేలాలు వేగేటంత జ్వరం! అమె లేవబోయి తూలి పడబోయింది! నే నామెను పొదివి పట్టుకున్నాను. లోపలికి నడిపించి కెళ్ళాను. అద్దంలో స్వామిని ఇద్దరం చూళ్ళేదు. బయటకొచ్చాము. ఆమెనెట్లాగో మెట్లు దింపి ముఖమంటపం దగ్గరికి తీసుకురాగలిగాను.

నావెనకాలే రామ్మూర్తొచ్చి అన్నాడు.- "ఈ.వో.గారు పిలుస్తున్నారట అర్జెంటుగా. రేపు ఉదయం కాటేజీలో కలుస్తాను. లాకుల దగ్గర గార్డెన్ కూడా చూపిస్తాను" అంటూ దూరంగా వస్తున్న విక్రాంత్ వైపు చెయ్యూపి వెళ్ళిపోయాడు

హఠాత్తుగా క్షీర తూలి పడబోయింది. నేను కంగారుపడ్డాను. "క్షీరా! ఏమయింది? ఎమిటది! పద ఎట్లాగోట్లాకిందికెళ్ళి డాక్టరు దగ్గరకెళ్దాం" అన్నాను.

క్షీర హటాత్తుగా నా కాళ్ళమీద పడిపోయింది. ఏడుపు గొంతుతో అంది- "ఏమండీ నన్నొదిలెయ్యరు కదూ! ఏం తెలిసినా సరే కదూ! ఎప్పటికీ కదూ! తప్పయిపోయిందండీ. ఊరికే ప్రేమించానంతే, ఇంకేం చెయ్యలేదు... ప్లీజ్, నన్నొదలరు కదూ!" నా కర్థమయింది. నే నింక బెట్టుపోవటం మంచిది కాదు. ఆమె నా స్థితిలో మామూలుగా కంట్రోలు చెయ్యలేను కూడా.

విసురుగా క్షీరను లేపి నుంచోబెట్టాను. చాచి లెంపకాయ కొట్టాను. ఆవేశంగా " యూ ఫూల్! పొద్దుట్నుంచీ చూస్తున్నాను. ఏమిటీ గొడవంతా ! ఏడుపు మాన్తావా, మానవా? !" అన్నాను.

క్షీర క్షణంసేపు బిత్తరపోయింది. వెంటనే నా నడుం కావలించేసుకుని - " నన్ను క్షమించండి క్షమించాననండి ... ప్లీజ్ ! " అంది

క్షణం సేపు ఆలోచించాను. "అయితే, ఇక్కడే ఉండు"అన్నాను. గబగబా గోపురం వైపు వెళ్ళిపోతున్న విక్రాంత్ దగ్గర కెళ్ళి - " ప్లీజ్ ఒక్కసారిట్లా వస్తారా?" అన్నాను.

అతన్ని క్షీర దగ్గరకి తీసుకెళ్ళాను. అన్నాను " మా పెళ్ళి కాకముందు ఈ క్షీర మిమ్మల్ని ప్రేమించింది. బహుశా మీరు ఇష్టపడుండొచ్చు. అప్పట్లో మీరిద్దరూ ఈ కొండమీదకొచ్చారు. ఆ తరువాత ఈమె తెలిసో తెలియకో మిమ్మల్ని కాకుండా నన్ను చేసుకుంది. నిజమేనా?" విక్రాంత్ అవాక్కయ్యాడు! ముఖం వివర్ణమైంది. కానీ పరిస్థితి గమనించి కాబోలు - " అవును" అన్నాడు

క్షీర వినాలనే గట్టిగా అన్నాను. " క్షీర తను ఘోరమైన తప్పుచేసినట్లు భావిస్తోంది. పొద్దున్న మిమ్మల్ని చూసినప్పటినుంచి తలుచుకుని కుమిలిపోతుంది. ఇప్పుడు నూట రెండు డిగ్రీల జ్వరం కూడా తెచ్చుకుంది.... పెళ్ళి కాకపూర్వం ఇష్టా ఇష్టాలు ఉండడం సహజం. అవి ఆ తరువాత అట్లాగే నెరవేరాలని ఎక్కడుంది? చిన్నప్పుడు అనుకున్న మేనరికాలు ఎన్నో ఆ తరువాత జరగవు. అంతమాత్రాన వాళ్ళంతా తప్పుచేసిన వాళ్ళేనా? జీవితం అక్కడితో అఖరేనా? అసలు జీవితమంటే వివాహం ఒక్కటేనా? అనుకున్న వ్యక్తితో వివాహం జరగకపోతే ఆయువు అంతం చేసుకోటమేనా? ఈ విలువైన జీవితానికి ఇంకే లక్ష్యం లేదా?

" జీవితంలో ఎన్నో విషయాల్లో రాజీ పడుతున్నాం మనం. విధి ప్రసాదించిన వ్యక్తితో రాజీపడలేమా? మీరేమంటారు మాస్టారు? ... నే నీమెను క్షమించాలట. ఆమె గత జీవితంతో నాకేం సంబంధం ఉందని నేను క్షమించాలి? ఏమైనా చెయ్యగలిగితే మీరు చెప్పాలి! ప్లీజ్, ఏమైనా చెప్పండి ఆమెకు తృప్తి కలుగుతుందేమో ? మీ మీద నాకు నమ్మకముంది."

విక్రాంత్ ఒక్క క్షణం ఆలోచించాడు. దృఢంగా అన్నాడు - " మీరన్నవన్నీ కరెక్టే. నావీ అవే అభిప్రాయాలు కూడా ! ఈ క్షీర మునుపటి క్షీర కాదు. నేను మునుపటి విక్రాంత్‌ని కాదు. వివాహం అవ్వగానే మేము పరులసొత్తయిపోయాం. ఈమె నాకు ఇప్పుడు లోకంలో అనేకమంది స్త్రీలలో ఒక స్త్రీ. ఒక తోబుట్టువు ! దట్సాల్! అసలు... అసలు...సార్ ఈమెను నేనెప్పుడో మర్చిపోయాను. ఈమెవరో నాకుతెలీదు.... పార్డన్ మి ప్లీజ్ ! ఇపుడు నా సమస్యేటంటే నేనిక్కడ ఎక్కువసేపు మీతో మాట్లాడుతూ నుంచోటం మంచిది కాదు. తనకి తెలీకుండా తనకి కష్టం కలిగించేదేదో మనం చర్చించుకుంటున్నామన్న భావం నా భార్యకు కలగడం మంచిది కాదు. అదింకో కొత్త కథకు దారితీయ్యోచ్చు. అలా దారి తియ్యకుండా చూడడం నాబాధ్యత. నేను నా భార్యను మాత్రమే ప్రేమించడం అసలు బాధ్యత ! ఏవంటారు - అదే ఇవన్నీ మీ క్షీరకు చెప్పండి! ఆఖర్న ఒక్కమాట. 'నీ గత జీవితంతో నాకు సంబంధం లేదు' అనే భర్త ఒక హిందూ స్త్రీకి లభించడమంత అదృష్టం మరొకటి లేదు. మీ క్షీర మహా అదృష్టవంతు రాలు! ఆ అదృష్టమే ఆమె సంసారజీవితానికి మూలధనం. ఆమెకు నాబెస్ట్ విషెస్ చెప్పండి! వస్తానాసార్ "!

విక్రాంత్ వడివడిగా వెళ్ళి అసహనంతో ఎదురుచూస్తున్న తన భార్యని కలిశాడు. వాళ్ళు వెళ్ళిపోయారు.

ముందరగా నేను మాట్లాడిన మాటలన్నీ అతనందుకున్నాడు. అతనికి మనస్సులో అసలేముందో గాని పైకి మాత్రం మాకు అనుకూలంగా మాట్లాడాడు. నేను కోరుకున్న ప్రకారం అతని వల్ల మాకు లాభం జరిగింది.

ఆశ్చర్యంగా క్షీర ఏడుపు మానేసింది !!!

నే నామెను ఆలయ గోపురం బయటికి నడిపించుకెళ్ళాను. అక్కడ పంపుల దగ్గర నీళ్ళతో ఆమె మొహం కడిగాను. మా కోసమే అన్నట్లు బస్సు సిద్ధంగా ఉంది. ఎక్కాం. రోడ్డు కిరువైపులా ఉన్న మారేడు వృక్షాల చల్లటి గాలి పీలుస్తూ కిందకెళ్ళాం.

క్షీర స్నానం చేసొచ్చింది. ఆశ్చర్యం! అంతటి పెనం పగిలే జ్వరం హుష్ కాకి అయిపోయింది !

ఇద్దరం ఫలహారం చేశాం. ఏకశయ్యాగతులయ్యాం. నేనామెను దగ్గరికి తీసుకున్నాను. చేత్తో ఆమె వీపునూ, తలనూ నిమిరసాగాను. ఆమె గువ్వలా నా డొక్కలోకి ముడుచుకుపోయింది.

రెండు నిముషాల్లో ఆమె నిద్రలోకి జారుకుంది. మధ్యాహ్నం అతిగా నిద్రపోవడం వల్ల నాకు నిద్ర పట్టలేదు. లేచి కుర్చీలో కూర్చుని ఆమె వైపు తదేకంగా చూస్తూ ఉండిపోయాను. నాకాలోచనలు వచ్చాయి. పెళ్ళయిన ఈ ఆర్నెల్లలోనూ పాలు నీళ్ళులాగా నాతో కలిసిపోయిందేగాని ఏనాడు ఎడ్డమంటే తెడ్డెం అనలేదు ఈ అమ్మాయి. ఇట్లాంటి పిల్ల లోకం దృష్టిలో పెద్దగా తప్పుగాని విషయాన్ని పెద్ద తప్పుగా భావించి ఎంత తల్లడిల్లిపోయిందో! ఏదైనా తప్పుచేస్తే ఇంకెంత తల్లకిందులౌతుందో!.

'ఎంత ముగ్ధ ఈమె ! ఎంత స్వచ్ఛ ఈమె! ఈమె మనస్సు స్ఫటికం! ఇట్లాంటి మనసు నా సొంతం అవటం ఎంతదృష్టం !... అమ్మో ఈమెను కాకుండా ఇంకెవరినైనా చేసుకునుంటే నేనెంత నష్టపోయుండేవాడినో. ఈ మనసు నాకు కావాలి శాశ్వతంగా కావాలి! ఇదేనా ప్రేమంటే! ఇదేనా లవ్వంటే! అవ్వనీ! చటుక్కున వెళ్ళిపోయి నా క్షీరాబ్ధి కన్యకను ముద్దు పెట్టుకున్నాను. ఆమె చెవిలో ఊదాను.

"క్షీరా నా క్షీరా , ఐ లవ్ యు! ఐ .. లవ్వ్వ్ యూ్యా...!

(ఆంధ్రప్రభసచిత్ర వారపత్రిక 24-10-90)

★★★ ★★★ ★★★

# క్విట్ ఇండియా ఉద్యమం!

"బావా బావా నీ కొడుకు జిల్లా ఫస్టు వచ్చాడు. ఇదుగో పేపరు"! వారణాసి రావు పదోతరగతి ఫలితాలున్న పేపరును తన బావ సూర్యారావు కిచ్చాడు.

సూర్యారావు పేపరు చూసాడు. అన్నాడు- " నీ కొడుక్కు ఫస్టుక్లాసు వచ్చింది గదా! అది మాత్రం తక్కువా! ఇద్దరికీ ఆనందమే !"

" మీ వాడికి జిల్లా ఫస్టు రావడం సహజమే. కానీ మా వెధవకు కూడా జిల్లాలోనే ఏ సెకండు ర్యాంకో థర్డ్ ర్యాంకో రాకూడదా!... ఈ ముండమోపి పదవ క్లాసులోనే ర్యాంకు తెచ్చుకోలేక పోతే పై క్లాసుల్లో ఎట్లా తెచ్చుకుంటాడు. అమెరికా ఎట్లా వెళతాడు?" వారణాసి రావు నిట్టూర్చాడు.

" అంటే మీ వాణ్ణి అమెరికా పంపించాలనుకుంటున్నావన్నమాట!.. చెప్పావుకాదూ !" సూర్యారావు పేపరు పక్కకు పెట్టి కుతూహలంగా ముందుకు వంగాడు తన బావమరిదివైపు.

వారణాసిరావుకి ఊపొచ్చింది " తప్పదయ్యా తప్పదు ! అమెరికా వెళ్ళక తప్పదు. కనీసం వెస్ట్ జర్మనీ, ఫ్రాన్స్, బ్రిటన్, ఆఖరికి ఇటలీ, ఇండీస్ ఎట్లాగోట్టా కనీసం మాస్కో అయినా సరే! అసలీ దేశంలో ఏముందని ఇక్కడుండాలయ్యా! ఉద్యోగాల్లేవు. కోట్లుంటేగాని వ్యాపారం చెయ్యలేము. రాజకీయాల దుర్వాసన. అంతటా అవినీతి. అక్రమాలు. అన్నీ కంట్రోళ్ళు అసలు క్యూలో లేకుండా ఒక్కరోజన్నా గడుస్తుందా నిత్యమున్నూ! మన మెట్లాగు ఈ కశ్మలంలోంచి బయటపడేది లేదు కనీసం మన